# మనస్సాక్షి - అవినీతి నుండి రక్షణ

ఎ. పి. జె. అబ్దుల్ కలాం

(శ్రీ A. P. J. అబ్దుల్ కలాం భారతదేశం లో జన్మించిన ఒక మేధావి. ఆయన గుండెల్లోంచి వచ్చిన ఈ పలుకులు ప్రతివారికి ఆదర్శం. సింగరేణి కార్మికుల ప్రయోజనార్థం దాని తెలుగు అనువాదం, క్రింద ఇవ్వబడినది.)

మనస్సాక్షి మన ఆత్మ యొక్క వెలుగు. అది మన మనస్సు మూలాలను కాంతివంతం చేస్తూ ఉంటుంది. అది జీవితమంత సత్యం. మంచికి వ్యతిరేకంగా మనం ఎప్పుడు ఆలోచించినా లేక పనిచేసినా అది తన గొంతును విప్పుతుది. మరియు ఆందోళన చేస్తుంది. మనం చేసే పనులు, ఆలోచనలు మంచివా, చెడ్డవా అన్న విషయాన్ని ఒక జ్ఞానం రూపం లో మనకు జన్యుపరంగా సంక్రమించే సత్యరూపమే మనస్సాక్షి. మనస్సాక్షి అనేది మనం చేసిన తప్పులు వ్రాయబడి నమోదు అయిపోయే అతిపెద్ద చిట్టాగ్రంథం కూడా. అది ఒక తిరుగు లేని సాక్షి. అది అన్నిటినీ తన నియంత్రణలో పెట్టుకొని మనలను భయపెడుతుంటుంది, బాసలు చేస్తుంది, పరిహారమిస్తుంది, ....... అంతేకాక శిక్షిస్తుంది. మనస్సాక్షి మనలను ఒకసారి కుడితే అది ఒక చివాటు. అది రెండు సార్లు కుడితే - అది ఒక అభిశంసన. పిరికివాడు అడుగుతాడు 'ఇది సురక్షితమైనదేనా' అని. దురాశపరుడు అడుగుతాడు ' ఇందులో లాభమేదైనా ఉందా?' అని. గొప్పలు కోరే వాడు అడుగుతాడు 'ఇది నాకు గొప్ప ధనాన్ని తెచ్చిపెడుతుందా?' అని. సుఖలాలసుడు అడుగుతాడు 'ఇది నాకు సుఖాన్నిస్తుందా?' అని. కాని మనసాక్షి అడిగేది మాత్రం - 'ఇలా చేయడం మంచిదేనా?' అని. మరైతే మనం మనస్సాక్షి గొంతు వినబడని చెవిటి వాళ్ళం ఎందుకు అయ్యాం? దాని అంకుశం పోట్లు గుచ్చుకోనంత తోలు మందపు వాళ్ళం ఎందుకయ్యాం. దాని విమర్శలకు స్పందించని రాతి హృదయులమెందుకయ్యాం? - వీటన్నిటికి సమాధానం ఒక్కటే -**అవినీతి.**

ఆవినీతి అనేది మనస్సాక్షిపై జరిగే తీవ్రమైనదాడి. లంచం తీసుకొని పనులు చేసిపెట్టే అలవాటు చాలా సాధారణం అయిపోయింది. ముఖ్యమైన పదవులలో

వున్నవారు తమ మనస్సాక్షిని విస్మరించటం ఎక్కువ చేశారు. అంతా బాగానే వుందని వారు బొంకుతారు. కాని ప్రతి చర్యకు ఒక వ్యతిరేక ఉంటుందన్న సూత్రాన్ని వారు మరిచారా? అంతఃశ్చేతన యొక్క ప్రభావాలు మరియు వాటి వత్తిడి ఎలా పని చేస్తూంటుందో వారు మరిచారా? నువ్వు లంచం తీసుకొంటే నీ ఆలోచనలు, పనులు మనస్సాక్షిలో నమోదు అవుతాయి. నీ ముందు తరాల వారు దారుణ బాధలకు గురి అయ్యేలా నీవు నీ నీతి బాహ్యతను వారికి అంటగట్టడం లేదా? మన వ్యక్తిగత జీవితంలోనే కాక సామాజిక జీవితంలోని అన్ని పార్శ్వాలనూ ప్రభావితం చేస్తున్న అవినీతి ఒక జీవన శైలిగా మారిపోవటం ఒక బాధాకర సత్యం. అది డబ్బులు పుచ్చుకొనే అవినీతి మాత్రమే కాదు. ఇతర రూపాలలో ఉన్న అవినీతి కూడా. అవినీతికర పద్ధతులు అవలంబించడం ద్వారా వ్యక్తులు ఉన్నత స్థానాల్లో కొనసాగటం, తద్వారా అధికారం చలాయించడం వలన నైతిక స్థాయి అల్పంగా ఉండే వారి మనస్సుల్లోంచి అపరాధ భావన తొలగి పోయింది. ఎంతటి భయానక స్థితి? ఒక గొప్ప నాగరికత ప్రమాదం లో పడింది.

కేవలం నీతిమంతుడైన మనిషి మాత్రమే మనస్సాక్షి అనే సాధనాన్ని వాడగలడు. ఆత్మ యొక్క అంతరంగిక పిలుపును అతడు మాత్రమే స్పష్టంగా వినగలడు. పాపాత్ముడి మనసులో ఈ సహజ సామర్ధ్యం నశించిపోయి వుంటుంది. అతడి మనస్సాక్షి యొక్క సున్నితత్వాన్ని అతడు చేసిన పాపం, అవినీతి, నాశనం చేసి వుంటాయి. అందువల్ల అతడు మంచి నుండి చెడును వేరుచేయలేడు. సంఘాలకు, వ్యాపార సంస్థలకు, వ్యవస్థలకు మరియు ప్రభుత్వాలకూ నాయకత్వం వహించే వారు అవినీతి పరులైతే ఎలా? పరిశుద్ధమైన మనస్సాక్షిని కలిగివుండి, ఆందోళనకు, అన్నిరకాల భయాలకూ దూరంగా స్వేచ్ఛను అనుభవించటం వివేకవంతమైన పనికాదా? ఈ రోజు తప్పుడు పనులూ, పాపకార్యాలు చేస్తు వాటిని నువ్వు తేలికగా కొట్టిపారేస్తుంటే రేపు నీవు తీవ్రమైన నేరాలను చేయటానికి వెనుకాడవు. ఒక పాపానికి నీవు అంతరాత్మలోనికి చోటు ఇచ్చి, నివాసం కల్పిస్తే వెయ్యి పాపాల ప్రవేశానికి నువ్వు దారి కల్పించినట్లే. నీ అంతరాత్మ మొరటుగా తయారై తన సున్నితత్వాన్ని కోల్పోతుంది. పాపపు పనులు చేసే అలవాటు తేలుకుట్టిన విషంలా శరీరమంతా వ్యాపించిపోతుది.

నీవు అవినీతి పరుడవైనప్పుడు నీ అవినీతి ఫలాలను ఆస్వాదిస్తున్న నీ పిల్లలు నిన్ను వెక్కిరిస్తున్నారన్న విషయం నీకు తెలుసా? వాళ్ళు తెలివైన వాళ్ళు మరియు వారికి అన్ని విషయాలు తెలుసు. నీ పిల్లలకు నువ్వు చేసే వంచనను దాచనంత సున్నితమైనది. 'తండ్రి' అనే నీ ముసుగు. నువ్వు నీ పిల్లలకు ఇంకెంత మాత్రమూ ఆదర్శవంతుడివి కావు. ఈ అవమానం చాలదా నీకు? ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల మనస్సాక్షి యొక్క నిరోధక వ్యవస్థ మీద అవినీతి చేస్తున్న దాడి ఎయిడ్స్ రోగి శరీరం మీద HIV చేసేంత ధారుణంగా ఉండే దశకు మన సమాజం వేగంగా చేరుకుంటోంది. అవినీతి మన నరనరాల్లో చొచ్చుకు పోయింది. మనలను మనం ఒక నాగరికతగా కపాడుకోగలమా?

మత నాయకులు నీతి సూత్రాలను, సత్ప్రవర్తనకు సంబంధించిన భోధనలను, నియమావళులనూ రూపొందించారు. అందమైన శ్లోకాలను, గీతాలనూ, ప్రార్థనలను రాసారు, సర్వబద్ధం చేసారు. అయినాసరే మనస్సాక్షిని అవినీతి నాశనం చేస్తుండటం చాలా భయపెడుతూవుంది. మనస్సాక్షిని తీర్చిదిద్దడంలో మతం సమర్ధవంతంగా పనిచేయలేకపోయింది. మరైతే ఇంకెవరుచేయాలి? మన మనస్సాక్షి మరల జీవం పుంజుకొంటుదా?

"మతాల ఐక్యత మరియు పౌరసత్వజ్ఞానోదయ సంస్థ" [Foundation of unity of Religious and Enlightenment of Citizenship (FOREC) ] ద్వారా అవినీతికి వ్యతరేకంగా ఉద్యమించడం ఒక నవ్యాంక్షం కావాలి.

[తేది 04-07-2005న కొత్త ఢిల్లీలో జైనముని ఆచార్య శ్రీ మహాప్రజ్ఞ 86వ జన్మదినం సందర్భంగా ఆయనతో అప్పటి దేశాధ్యక్షుడు శ్రీ APJ అబ్దుల్ కలాం జరిపిన సంభాషణపై ఆధారీతం].

[తేది 07-07-2005 నాటి "హిందూ" దిన పత్రిక సౌజన్యంతో]

[అనువాదం: శ్రీ MZ రహమాన్]
డప్యూటి పర్సనల్ మేనేజరు
విజిలెన్సు విభాగం, కొత్తగూడెం.